భార్య శీలాన్ని
శంకించిన
ఆ భర్తకి తెలిసిన
భయంకర నిజం!

# నెత్తుటి వెలుగు

కొండా
కుసుమ
కుమారి
కథ

పుచ్చపువ్వులాంటి వెన్నెల వరదల్లే ఎగసిపడుతుంటే చూడలేని క్రూరకారు మేఘాలు మూకుమ్మడిగా ముసురుకుని కసితీరా కాటేస్తూ వెలుతురు పువ్వుల్ని చిదిమేస్తున్నాయి.

అదిచూసి వెన్నెలకు తోడొచ్చిన పిల్లగాలులు ఆవేశంతో చెలరేగిపోతూ మబ్బులతో యుద్ధానికి తలపడ్డాయి.

మసక చీకటి మాటున తలదాచుకున్న కన్నె వెన్నెల కంటతడి పెట్టినట్లు టపటప చినుకులు మొదలయ్యాయి.

తల్లి జోలపాటకు ఆదమరచి నిదురపోతున్న పసిపాపలాంటి ప్రకృతిలో క్షణాల్లో ఏదో మార్పు! ఎంతో కలవరం! అప్పటిదాకా ఏవో చిలిపి కోరికల తలపోతతో తలమునకలైన వీరిగాడు ఆచ్ఛాదనలేని ఛాతి మీద చిటపట చినుకులు రాలడంతో ఉలికిపాటుతో మంచెమీద లేచి కూర్చున్నాడు.

మనసు మత్తెక్కించే అందమైన దృశ్యాలన్నీ మబ్బుల్లా చెదిరిపోయాయి. కాని గుండెల్లో గుబులు మాత్రం మరింత పెరిగింది. ఒంటిని తాకుతున్న చినుకులు అణువణువునా తట్టి లేపినట్లనిపిస్తుంది. చల్లగాలి నీలి స్పర్శను తలపిస్తుంది.

చేను కాపలాకిగాను చానాళ్లుగా మంచెమీదే పడక. కాని నీలి తలపులు నిద్రపట్టనిచ్చేవి కావు.

ఎన్నోసార్లు చేనొదిలి గుడిసెకు పోదామనుకునేవాడు. ఒక్కోసారి పంచెగట్టి, తలపాగా దులిపి మంచె దిగగానే దొర గుర్తొచ్చేవాడు.

అంతే! నీరుగారిపోయి నిస్సత్తువతో మంచెమీద కూలబడేవాడు.



ఆ ఊరి మోతుబరి, గ్రామపెద్ద అయిన నరసింహాన్ని దొర అనే పిలుస్తారు అంతా. అతడి పొలేరు పీరిగాడు.

అలా ఎన్నో రాత్రులు నిర్జీవంగా గడిచిపో

తున్నాయి. నేలరాలిన పువ్వుల్లా వాడిపోతున్నాయి.

కాని ఈ రోజు పుచ్చపువ్వులాంటి వెన్నెల్నీ, ముసురుకున్న మబ్బుల్నీ తట్టి

లేపిన చిమకుల్ని చూస్తూ మిన్నకుండలేకపోతున్నాడు. దొరకు తెలియకుండా అయినా నీలి దగ్గరకెళ్లాలని తీర్మానించుకుని మంచె దిగాడు.

ఒంట్లో ప్రతి అణువూ ఆమె తోడుకోస గొంతెత్తి ఘోషిస్తున్నట్లే అనిపిస్తుంది.

అసలు నీలి తలుపుకొస్తే చాలు ప్రకృతిలో పువ్వులన్నీ ఒక్కసారిగా విచ్చినట్లు, పున్నమి వెలుగుల్ని మూటగట్టి కుమ్మరించినట్లు, ఆకాశంనుండి ఏవో అమృతధారలు జాలువారుతున్నట్లు మనసు పులకరించిపోతుంది. నీలి రాక బండబారిన తన బతుకులో ఓ వసంతం! దొరగారింట్లో పమలన్నీ చేసి పశువుల్ని తోలుకుని రోజూ కొండవాలుకొచ్చేవాడు. వాటిని మేపుతూ ఆ మందలో కలిసిపోయిన పీరిగాడికి ఓరోజు కొత్తలోకం కనిపించింది.

కుమ్ముకుంటున్న ఆవుల్ని అదిలిస్తుంటే ఎక్కడినుండో కిలకిలమన్న నవ్వు దేవతల కాలి అందెల సవ్వడిలా వినిపించింది.

దిక్కులు కలియజూస్తుంటే గాలి వాలుకు కొట్టుకొచ్చిన పెన్నిధిలా నీలి ఏ మూలనుండో రివ్వున దూసుకొచ్చి తన ముందు నిలిచింది.

ఉలిక్కిపడి కళ్లింత చేసుకుని చూశాడు.

ఒంటి ఛాయ తక్కువైనా తీర్చిదిద్దిన కనుముక్కు తీరుతో, పొంగులెత్తుతున్న ఒంపుసొంపులతో చూపు తిప్పుకోలేనంత సొగసుగా వుంది ఆమె.

కొండగాలికి పరికిణీ ఓణీ ఒయ్యారంగా ఎగురుతుంటే వాటినలా వదిలి కొడవలి కొన చెంపకానించుకుని విరగబడి నవ్వుతుంటే మానవ సంచారంలేని ఆ బీడులో ఒంటరిగా తిరుగుతున్న ఏ కొండదేవతో, కోనదేవరో కాదుకదా అని ఝుడుపు పుట్టింది. గభాల్న వెనుదిరిగి పరుగందుకోబోతుంటే చెయ్యి పట్టుకుని తనవైపుకు ఓ గుంజు గుంజింది. అంతలోనే కళ్లల్లో ఆగ్రహం కురిపిస్తూ. ఏ... ఏంటంది!'' బెదిరిపోయాడు.

''మగ తోడున్నావని డొంకలో గడ్డి కోసుకోవడానికొత్తే ఒంటిగా వదిలి పరుగెడతావా? సిగ్గులేదూ?

అంత చేరువలో ఆమెను చూసేక సిగ్గన్నది అప్పుడు గుర్తొచ్చింది.

గుండెలెందుకో వేగంగా కొట్టుకున్నాయి.

''సర్లే. ఆ రాతిమీద కూకుందాం—రా'' అంటూ జబ్బ పట్టుకుని బరబరా లాక్కుపోతుంటే జివజివలాడిపోయాడు.

''ఎందుకెందుకూ?''

''నిన్ను కొరుక్కుతినడానికి'' కిలకిలమన్న నవ్వు దేవతల కాలి అందెల సవ్వడిలా.

అలా గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు.

బండమీద కూలేసినట్లు తోసి తనూ పక్కన కూర్చుంది.

కొంగున మూట గట్టుకొచ్చిన అలుకులు అతడి చేతిలో పోసి ''ఊ! తింటూ కబుర్లు చెప్పు'' అంది.

''ఏటి సెప్పను? అసలెవరు నువ్వు?''

''ఏడిసినట్టుంది. ఇదేనా సూట్టం నన్ను? రోజూ ఈ డొంకలో గడ్డి కోసుకుంటున్నా సూడలేదన్నమాట. మాది ఆ కొండవాగుకి అవతల వున్న పల్లెలే. ఈ వానాకాలమంతా

పచ్చగడ్డి బాగా దొరుకుతుందని ఇంతదూరం వొత్తన్నా. ఏన్నీ రోజా మూత్తానే వున్నా'' అతడి కళ్లలోకి చూసింది.

''నేనెప్పుడూ సూడలా!'' వీరిగాడు వెనక్కి జరుగుతూ అన్నాడు.

''సరేగాని రోజా పశువుల్ని మేపడమేనా ఇంకేవైనా సేత్తావా?''

ఆ మాటతో ఉషారొచ్చింది వీరిగాడికి. ఉత్సాహంతో చెప్పుకొచ్చాడు.

శానా పన్లు సేత్తాను. తొలిఝాముున లేసి దొరగారి దేవిడీ అంతా సుబ్బరం సేత్తా పశువుల కొట్టం వూడిసి గేదెలకు కుడితిపట్టి పాలు పితికి దూడల్నొదులుతా. ఆనక దొరసానమ్మ లేసి అంట్లపనీ, పాసిపనీ అప్పజెప్పుద్ది. ఆయమ్మ పనులన్నీ సేసేపరికి దొర లేత్తాడు. ఆ అయ్యకి మొహం కడుక్కోను నీళ్లందిత్తా. పొగాకు సుట్టేత్తా. ఒంటికి నూనె పట్టించి ఏణ్ణీళ్లు కాసి నేనే పొయ్యాల. సలువబట్టలందించాలు. కాలు జోడు తుడిపి, సేతికందించాల. దొర వూళ్లోకి బయలెల్లేదాకా అన్నీ నేనే సూడాల. ఆయన దొరసానమ్మ పెట్టిన సద్ది తిని పశువుల్ని తోలుకుని ఇట్టా వత్తా. మళ్లీ సందేళ ఇంటికెళ్లే ఝాము తిరిగేదాకా పనే! ఒకటేమిటి! అన్ని పన్లూ నావే!!

కళ్లింత చేసుకుని వింటున్న నీలి ''జీతం ఎంతిత్తాడు దొర?'' అంది.

అటుకులు పటపట నములుత్తా ఓ వెర్రి నవ్వు నవ్వాడు. వీరిగాడు. ''జీతమేటి? మా అయ్య సేసిన బాకీ నేను తీరుతున్నాను. దొరే ముప్పూటలా తిండి పెట్టి ఏడాదికోపాలి బట్టలిత్తున్నాడు. ఇంకా జీతమేటి?''

పంటికింద రాయి తగలడంతో 'థూ'' అంటూ వూసి బండమీద ఓ దూకు దూకింది నీలి.

''గొడ్డు శాకిరీ సేయించుకుని పశువుకింత గడ్డేసినట్టు నీకింత తిండి పడేత్తున్నాడన్న మాట. సీ! ఏం బతుకు!'' వీరిగాడికి కోపం

## సెంటిమెంట్



కమ్మని సువాసనలు వెదజల్లే సెంట్ అంటే అందరికీ ఇష్టమే! అలాగే మన తెలుగు సినిమా పరిశ్రమలో 'సెంటిమెంట్' అంటే... అంతే మరి. అస్సలు ఒక్క మాటలో చెప్పాలంటే సినిమా పరిశ్రమ అంతా సెంటిమెంట్‌మీదనే నడుస్తోంది. అందుకు ఎన్నో ఉదాహరణలు. ఒక ఉదాహరణ వ్యాపారస్తుడు టివిడి ప్రసాద్, తమిళ దర్శకులు మౌళితో కలిసి 'అశ్వని' అనే చిత్రాన్ని తీశారు. అవి సక్సస్. అంతే వరుసగా మరో దర్శకుడి జోలికి పోకుండా మౌళితోనే చిత్రాలు తీస్తున్నారు. ప్రస్తుతం ఆంటీ చిత్రం తీశారు. ఇదే విషయాన్ని అడిగితే 'సెంటిమెంట్' అంతే. మరేం లేదు. అన్నారు. నిర్మాత టి.వి.డి. ప్రసాద్.

సుబ్బారావు

వచ్చింది.

"సాల్లే! మరి మా అయ్య బాకీ ఎవురు తీరుత్తారు? గొప్ప సెప్పొచ్చావుగాని"

"మరి జీతం భత్తెం లేకుండా మీ అమ్మ, అయ్యా, ఆలినెట్టా పోషిత్తావు?

వీరిగాడు మొహం మచ్చేసినట్లయింది. నెమ్మదిగా చెప్పాడు.

"నాకెవరూ లేరు."

ఆ మాటకు నీలి నొచ్చుకున్నట్లు చూసి "సర్లే బాధపడమాక" అంటూ చెయ్యి పట్టుకుని చెప్పింది.

వీరిగాడు బండదిగి పశువుల్ని అదిలిస్తూ "మరి నీ గురించి చెప్పావుకాదేం! మీ అయ్యేటి సేత్తాడు!" అన్నాడు.

"అయ్య ఎగసాయం సేత్తాడు. అమ్మ పాడి సేత్తది. వేనిట్టా వచ్చి గడ్డి కోసుకెల్తా.

నువ్వొ ఎగసాయం సేసుకోరాదూ?"

నిట్టూర్చాడు. "వున్న మడిసెక్క కాత్తా అయ్య పోయినప్పుడు దొరకాడ తాకట్టుబెట్టాను. అది ఇడిపించుకోవాలనే ముగ్గురు పాలేర్ల పనే చేస్తున్నాను.

"గొప్ప మగాడివే!" వెక్కిరించింది.

"కానా?" రెట్టించాడు.

"సూద్దారి. వుప్పుడు కాదు. ఆనక" కిలకిలమంది.

ఆ నవ్వుకు గుండెలమీద పూసలపేరు ఎగిరెగిరిపడింది.

అప్పటినుండి రోజూ పశువుల్ని మేపుతూ, గడ్డికోస్తూ కథలూ, కబుర్లు చెప్పుకునే వాళ్ళు. తెచ్చుకున్న సద్ది కలిసి పంచుకునేవాళ్ళు.

నీలి రాకతో లోకం అంతా చాలా అందంగా కనిపించేది వీరిగాడికి. ఒక్కరోజు నీలి రాకపోతే, ఆమెను చూడకపోతే ప్రాణం కొట్టుకులాడిపోయేది. ఆ రోజంతా ఎంతో వెలితిగా అనిపించేది.

నీలికైతే వీరిగాడిపట్ల వల్లమాలిన ప్రేముంది.

ఓరోజు వస్తూనే అతడి గుండెలమీద వాలిపోయి భోరుమంది.

"ఏమైంది నీలీ!" కంగారుపడిపోయాడు.

"మనం పెళ్లి సేసుకుందాం" అరచేత్తో కళ్ళు తుడుచుకుంటూ అతని మొహంలోకి చూసింది.

"పెళ్లా! మనకా? మీ అయ్య నా మక్కెలిగరదీత్తాడు" రెక్కలుపట్టుకుని గుంజింది కోపంగా.

"అందుకని నన్ను పెళ్లాడవా?"

"అదికాదు నీలీ! మీ అయ్య నిన్ను పట్నంవోడికివ్వాలనిగదా. మరిప్పుడు నేను పెళ్లాడతానంటే ఊరుకుంటాడా!"

అతడి చేతిని విదిలించి కొట్టింది. "నువ్వొ మా అయ్యలాంటోడివేనన్నమాట! ఆడదాని మనసు సూడలేని కటినాత్ముడివన్నమాట. సూడు. నిన్నే పెళ్లాడతానని మా అయ్యకి సెప్పి ఎన్ని దెబ్బలు తిన్నానో. సూడు, గాజులిరిగి ఎలా గీరుకుపోనాయో!" ముంజేతులు ముందుకు చాపింది.

నెత్తుటి చారికలు చూసి విలవిలలాడిపోయాడు.

తనకోసం, తనలాంటి దరిద్రుడితో కాపరం కోసం నీలి దెబ్బలు తినడం అతడ్ని

కంట తడిపెట్టించింది. గుండెధైర్యాన్నికూడా ఇచ్చింది.

చప్పున ఆమెను దగ్గరకు తీసుకుని గాఢంగా, తనలో ఇమిడిపోవాలన్నంత బలంగా హత్తుకున్నాడు.

గువ్వలా అతడి సందిట్లో ఒదిగిపోయిన నీలి నిలువెల్లా పులకించింది.

''మీ అయ్యేకాదు. దేవుడడ్డుపడినా నిన్ను మనువాడి తీరతాను. పద. ఉప్పుడే గంగానమ్మ గుడి కాడ తాళికడతా'' ఆమె చెయ్యి పట్టుకుని ముందుకు నడిచాడు బోర విరుచుకుని.

నీలి మొహం మంచుముత్యంలా మెరిసింది. అతడిచేతిని మరింత గట్టిగాపట్టుకుంది.

కాని మూడడుగులు వేశారో లేదో ముంచుకొచ్చిన ప్రళయంలా మూకుమ్మడిగా పదిమంది కర్రలతో ముందుకొచ్చారు.

నిర్ఘాంతపోయిన వాళ్లు తెప్పరిల్లకముందే ఎవరో నీలిని అతడినుండి బలంగా లాగడం, వెనువెంటనే టపటపమంటూ అతడిమీద పడడం జరిగిపోయింది.

కెవ్వుమంటున్న నీలి కేకలతోపాటు ఎముకలు విరుగుతున్న చప్పుడు మాత్రమే వీరిగాడికి తెలిసింది.

తెలివొచ్చేసరికి చుట్టూ జనం, ఎదురుగా దొర నిలబడి వున్నారు.

ఒళ్లంతా పచ్చడిముద్దలా అనిపించింది. ఏ అవయవం కదల్చాలన్నా ప్రాణం కడగంటిపోతుంది.

''ఏవైందిరా?'' ఎవ్రరా ఇట్టా ఒళ్లంతా కుళ్లబొడిసింది?''

మూలుగుతూనే నీలి విషయం చెప్పాడు.

దొర వెన్ను నిటారయింది.

''ఏ్రటా! కూతురు మనసుపడి మనువాడతానంటే ఇష్టంలేనోడు ఇంట్లో కూతుర్ని మందలించుకోవాలిగాని ఇట్టా బరితెగించి పొరుగూరివాడ్ని చితగ్గొట్టిస్తాడా? ఎవ్రడా



వాడు''

చెప్పాడు సీరిగాడు.

పక్కనున్నవాడు దొరకు గుర్తుచేశాడు.

దొరా! పోయినేడాది గంగానమ్మ జాతరకి పెద్ద పెబగట్టి మేళంతో వచ్చి పొట్టేలను బలిచ్చాడే. ఆడే మరిడయ్య! ఆడి కూతురు కళ్లెంలేని గుఱ్ఱంలా జాతరంతా కదం తొక్కిందికదా దొరా!''

చిలకాకుపచ్చ పరికిణీ, ఓణీలో చిలకలా కులుకుతూ బారెడు జడ ఎడమచేత్తో గిరగిర తిప్పుకుంటూ చెరుగ్గడ పుచ్చుకుని సంబరమంతా తనదే అన్నట్లు తిరిగిన సీరి రూపు గుర్తొచ్చింది దొరకి.

అంతే. అతడి కన్నులెఱ్ఱబడ్డాయి.

''ఆడికెంత పొగ్రరా! వున్న ఎకరం పొలం సూసుకోనా! పోటెత్తిన వరదలా వున్న కూతుర్ని సూసుకోనా! అయినా మనూరోడి మీద మనసుపడ్డ ఆడకూతుర్ని మళ్లీ ఎవరికిచ్చి పెళ్లిసేత్తాడా? కాపరం సెయ్యాలనే! వున్న పళంగా ఆడ్ని పిలుసుకు రండి. తేల్చేత్తాను. ఈరిగాడికెట్టా కూతుర్ని కట్టబెట్టడో సూత్తాను'' అంటూ చిందులు తొక్కాడు.

మరిడయ్యను వెంటబెట్టుకొచ్చారు దొర మనుష్యులు.

''ఏటి దొరా! నామీద అగ్గయిపోతుండారంట. మీరే సెప్పండిదొరా! ఒక్కగానొక్క కూతుర్ని సూత్తా సూత్తా ఎట్టిశాకిరీ సేసే ఈడికెట్టా కట్టబెట్టను? అది సుకపడడమే నాకు గావాల. పట్నంలో జవాను ఉజ్జోగం సేసే నా పెళ్లికొడుకిక్కివ్వాలని నా కోరిక''

''అట్టా అనుకొన్నోడివి ఆ పిల్లని వూరుమీద వొదలడం ఎందుకురా. ఎప్పుడో మేనల్లుడికిచ్చి ముడిపెట్టక! ఇప్పుడది మనసు పారేసుకున్నాక దానికి బుద్ధిసెప్పడంపోయి మావాడిమీన నీ సెతాపం సూపిత్తావా? ఏం సూసుకుని నీకీ పొగ్రరా! నువ్వు నా మనుసులతో ఎన్ను కొట్టిత్తే ఏటి సేత్తావు?''

సీరిగాడికి కొండంత అండగా దొర నిలబడతాడని ఊహించని మరిడయ్య బెదిరిపోతూ కాళ్లు పట్టుకున్నాడు.

''దొరా తప్పయిపోనాది మన్నించండి. నా కూతురికి బుద్ధిసెప్పి కట్టుబాటులో ఎట్టుకుంటాను. గడపదాటనివ్వను. చెమించండి''

''ఒరేయ్ మరిడయ్యా! నువ్వెంత కట్టుదిట్టం సేసినా నీ కూతురు నీ కన్నుగప్పి ఆడితో లెగిసిపోతే నువ్వేటి సేత్తావురా! అయినా నువ్విప్పుడు ఈడ్ని సేమించి రేపు ఇంకొకడితో కాపరం ఎట్టా సేత్తదిరా! ఈ యిసయం కట్టుకున్నోడికి తెలిత్తే ఆనక దాని బతుకేటవుద్ది? తెలివితేటలు సూపించి దాని బతుకు బుగ్గిసెయ్యకుండా లచ్చనంగా సీరిగాడితో మనువుకొప్పుకో. నీ కూతురికేం లోటు రానివ్వంలే. పెళ్లయ్యాక ఆడికి ఇంకో నాలుగు బత్తాల ఒడ్లు కొలిపిత్తాలే. ముగూర్తం ఎట్టించు''

తండ్రి వెనకే పరుగున వచ్చిన సీరి సీరిగాడిమీద పడి గోలున ఏడుస్తుంటే మరిడయ్య మాట్లాడలేకపోయాడు.

దొరే ఓదార్చి ధైర్యం చెప్పాడు సీరికి.

సీరిగాడి చెంపలమీద కన్నీళ్లు జారువారు

తుంటే శక్తినంతా కూడదీసుకుని చేతులెత్తి మొక్కాడు దొరకి.

"సెర్మం ఒలిసి సెప్పులు కుట్టిచ్చినా మీ రునం తీరదు దొరా! మీరుండగా నాకే దేవుడూ ఒద్దు దొరా! మీరే దేవుడు"

దొర కొండంత అండగా నిలబడగా వీరిగాడి పెళ్లి గంగానమ్మ గుళ్లో అట్టహాసంగా జరిగింది.

పెళ్లి ఖర్చులన్నీ దొరే పెట్టుకుని ఇద్దరికీ కొత్త బట్టలిచ్చాడు.

వీరిగాడి బతుకులో నీలి అడుగుపెడుతూనే అమృతకలశాన్ని అందించింది. తేనె ధారల్ని దోసిట కుమ్మరించింది.

అతడి కళ్లముందు కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించింది. అతడెన్నడూ ఎరుగని ఆప్యాయతానురాగాల్ని పంచి తన్మయుడ్ని చేసింది.

రోజులు పూరేకులపై మంచు ముత్యాల్లా తళుక్కుమంటూ ఆవిరైపోతుంటే ఓ రోజు నీలి అంది.

"రేపట్నుంచి నేనూ దొర కొలువుకొత్తాను మావా!"

భార్యను అరిచేతిలో పువ్వులా అపురూపంగా చూసుకుంటున్నా వీరిగాడు ఆ మాటకు తుళ్లిపడ్డాడు.

"మతిగాని పోయిందా. నువ్వు రావడమేటి?"

అతడి కళ్లలోకి చూస్తూ అరివిడిన పువ్వులాంటి నవ్వుతో "మతుంది కనకే ఆలోసించి సెబుతున్నాను. దొరసానమ్మ పనులు సెయ్యడానికి ఆడమడిసి కావాలంట. నేనొత్తానని సెప్పాను. ఇద్దరం కట్టపడితే మీ అయ్య బాకీ తొందరగా తీరిపోద్ది. ఆనక ఆ మడిసెక్క దున్నుకుంటూ మన బతుకు మనం బతకొచ్చు. నేకపోతే ఎన్నాళ్లిలా నీకీ ఎట్టిశాకిరీ! ఏనాటికి నువ్వు సుకపడేది. నువ్విట్టా పగలూ రాతిరీ రెక్కలిరుసుకుంటుంటే నేను సూడలేను మావా! పైగా

## హీరోయిన్

ఓ నిర్మాత ఓ విలేకరితో తన చిత్ర విశేషాలు వివరిస్తూ అన్నాడు.

"మా చిత్రంలో కథానాయిక పాత్ర ఎంతో విశిష్టమైనది. నటన పరంగా ఎంతో పేరు తెచ్చేది ఆ పాత్రలో నటించడం చాలా కష్టం"

"అంత మంచి పాత్రా?"

"అవును. ఆ పాత్రలో నటించడానికి తెలుగు కథానాయికలందరూ తిరస్కరించారు" చెప్పాడు ఆ నిర్మాత.

- బి.వి.ఎస్. బాబు (తెనాలి)



మన మద్దెన మరో బుడతడు రాబోతున్నాడు కూడా!'' అంటూ రెప్పలు వాల్చుకుంది సిగ్గుతో.

వీరిగాడు కళ్లింత చేసుకుని చూస్తూ అమాంతం నీలిని అక్కున చేర్చుకుని ''నిజవా! ఇది నిజవా నీలీ! సెప్పు'' అంటూ గడ్డం పైకెత్తి కళ్లల్లోకి చూస్తూ అడిగాడు.

నీలి మల్లెమొగ్గ విడినట్లు నవ్వింది.

''అవునయ్యా! నీకో కూడుకునివ్వబోతున్నాను. ఆడికోసరమైనా ఇద్దరం కట్టపడాల. ఆడికి సదువు సెప్పించాల. ఉజ్జోగం ఇప్పించాల. ఆడికోసం మనం డబ్బు సంపాదించాల''

''అయినా నువ్విప్పుడు ఒట్టి మడిసివి కాదుగదా! ఈ శాకిరీ ఎందుకు? కావాలంటే పురుడయ్యాక సేద్దువుగాని''

''దొరసానమ్మ మనుమంటే బండశాకిరీ కాదు. అయమ్మ సుస్తీ మడిసిదా! ఆడతోడుగా వుండి ఏ ఏలకేం కావాలో సూసుకుంటే సాలంట. మంచి జీతవే వుంటాదన్నారు''

వీరిగాడు మాట్లాడలేకపోయాడు.

నీలి వేకువనే మొగుడితోపాటు దొరింటికి బయలుదేరింది.

దొరసానమ్మ లేచేవరకూ వీరిగాడి పనుల్లో సాయం చేసింది.

లేచేక ఆమెకు తోడుగా వుండి మొహం కడిగించడంనుంచి స్నానం చేయించి అగరు దూపపు పొగవేసి ఆవిడకేం ఫలహారం కావాలో అది చేయించి తినబెట్టడం వరకూ అన్నీ తనే చూసుకుంది.

తర్వాత కొంతసేపు తోటలో తిప్పుగుతూ పూలమొక్కలను పరామర్శిస్తుంటే తోడుగా వుంది కబుర్లు చెబుతూ.

అప్పుడొచ్చాడు దొర!

భార్యను పలకరించి నీలి గురించి అడిగాడు.

''నీలి నా పక్కనుండి అన్ని పనులూ చేస్తుంటే నాకెంతో తేలిగ్గా అనిపిస్తుందండీ! కానీ దీని మొగుడికిది పనిలోకి రావడం బొత్తిగా ఇష్టం లేదట. దీన్ని అపురూపంగా చూసుకోవాలని వాడి కోరిక కాబోలు'' అంటూ నవ్వింది.

దొర నవ్వాడు. ''సరే మనం మాత్రం ఆడి కోరికను కాదని దీన్నెందుకు కట్టిపెట్టాలి. నీలీ నువ్వు దొరసానమ్మకు తోడుగా వుంటే సాలు. సన్నమెత్తు పని సెయ్యనక్కర్లా. అదీ దొరసానమ్మ ఆరోగ్గెం బాగాలేదుకనుక!''

''ఎంత మాట దొరా! ఆడి మాటకేమొచ్చెగాని పనిపాటా సెయ్యకుండా తెల్లారే బతుకులా మావి. దొరసానమ్మను కళ్లల్లో పెట్టుకుని సూసుకోనూ! మరి... '' ఇంకా ఏదో చెప్పాలనుకున్నట్లు చేతులు నలుపుకుంటూ నసుగుతుంటే దొరే అడిగాడు.

''ఏటే! ఏం కావాలి!''

''అది కాద్దొరా! మీ బాకీ జమకట్టాలనే నేనూ పన్లోకొత్తున్నాను. మా మావ జీతంతోపాటు నాదీ కట్టుకోండి. పొలం ఇడిపించుకోటానికి ఇంకా ఎంత బాకీవున్నామో మీరొక్కపాలి లెక్కజూసి చెప్తే...''

''అదా! తెలివిగలదానివే! అట్టాగే సూత్తాన్లే'' అన్నాడు.

గుడిసెకొచ్చాక వీరిగాడికి ఆ మాట

చెప్పింది నీలి సంబరంగా.

ఆశ్చర్యపోయాడు. "ఎంత దయిర్నవే నీకు! నావెప్పుడైనా అడిగితే అగ్గయిపోయేవాడు. డబ్బులట్టుకెల్లేటప్పుడు లెక్కుండదు. అప్పుడు ఏ అవుసరం పడినా దొరే కనపడతాడు. మరి జీతం జమ కట్టబోయేసరికి లెక్కలు సూడాల! తెలివి మీరిపోయారా ఎదవలు. పదీ పరకా తో ఏలెప్పటికి తీరేను! లెక్క జూసుకోకుండా ముప్పూటలూ తిండి పెదుతున్నా ఇశ్శివాసం లేని జాతిరా మీది అంటూ నానా తిట్లూ తిట్టేవాడు" అన్నాడు.

"దొరసానమ్మకు నేనూ! నా పనీ నచ్చింది మావా! అందుకే దొర మాట్లాడలేకపోయాడు" అంది మిలమిల మెరిసే కళ్లతో.

"నిన్ను నచ్చుకోనివాల్లెవరే!" గర్వంగా సూసుకున్నాడు భార్యని దగ్గరకు తీసుకుంటూ. గువ్వలా అతడి గుండెల్లో ఒదిగిపోతూ నీలి చెప్పింది. "దొర బాకీ తీరిపోతే మన పొలం మనవే సేద్దెం సేసుకోవచ్చు. ఆ డబ్బుతో మన బిడ్డని సక్కగా సదివించుకుని ఉజ్జోగం సేయిద్దాం. అప్పుడు మనకెంత గరవంగా వుంటుందో కదా మావా!"

"అవునే! మన బుడతడు మనలా కష్టపడకూడదు. మా అయ్య సేసినట్టు మనం బాకీలు సేసి ఆడి నెత్తిన పెట్టకూడదు. ఆడికి పలకాబలపం కొనిచ్చి బళ్లోకంపుదాం. పెద్ద సదువులు సెప్పించి గొప్పోడ్ని సెయ్యాల. మడత నలగని బట్టల్లో మనోడు దొరబాబులా వుండాల"

కళ్లముందు అందమైన దృశ్యాలెన్నో కనిపిస్తుంటే తన్మయులైపోయారు.

దొరసానమ్మ పనులు చెయ్యడం శ్రమ అనిపించకపోగా ఆనందంగా వుంది నీలికి.

తను ఒట్టి మనిషి కాదని ఇంట్లో చేసేవన్నీ పెడుతూ శ్రద్ధగా సూసుకుంటుంది. ఇంటి డాక్టరుకు చూపించి మందులు

## ఆత్రేయ పాట



రాసి ప్రేక్షకుల్ని, రాయక నిర్మాతల్ని ఏడిపిస్తాడు అని ఆత్రేయగురించి అనుకుంటూ వుంటారు. నేటి ప్రముఖ నిర్మాత డి.రామానాయుడు ఆత్రేయగురించి మాట్లాడుతూ "అప్పట్లో నా చిత్రాలన్నిటికీ ఆచార్య ఆత్రేయగారే రాసేవారు. మా ప్రేమనగర్ చిత్రానిక్కూడా ఆయనే పాటలు రాశారు. అయితే ఆ చిత్రంలో హీరో పుట్టినరోజున ఓ పాట పాడాలి. ఆ పాట రాయమంటే బర్త్‌డేకి పాటేమిటి. ఎవ్వరితోనన్నా రాయించుకోండి అన్న ఆత్రేయ ఆ తరువాత "నేను పుట్టాను ఈ లోకం నవ్వింది" అనే సూపర్ హిట్ సాంగ్ రాసిచ్చారు. "మాటల సందర్భంలో పాత జ్ఞాపకాలతో ఈ విధంగా వివరించారు.

సుబ్బారావు

కొనిచ్చింది. మంచి చీరలిచ్చి కట్టుకోమంది.

వీరిగాడు కూడా మురిసిపోయాడు.

నీళ్లోసుకుందని తనేవాడూ ఏదీ కొనితెచ్చి తినబెట్టింది లేదు.

ఇప్పుడు దొరసానమ్మ కన్నతల్లిలా చూసుకుంటుంటే ఆమెపట్ల, దొరపట్ల భక్తి కొండంత పెరిగిపోయింది.

నీలి పండంటి బిడ్డను ప్రసవించింది.

పసివాడ్ని చూసుకుని పరశించిపోయారు ఆలుమగలూ.

నీలికైతే పొద్దస్తమానం కొడుకుతోనే సరిపోతుంది. వాడే లోకం అనిపిస్తుంది.

ఉగ్గుపట్టి, నీళ్లోసి, పాలివ్వడం, ఉయ్యాల్లో వేసి నిద్రపుచ్చడం, ఏడుస్తుంటే బుజ్జగించి లాలిపాడడం అన్నీ ఆనందంగా అనిపించి తనని తానే మరచిపోతుంది.

నెల తిరక్కుండానే దొరసానమ్మనుండి కబురొచ్చింది.

నీలి దిగులుపడిపోయింది.

"బుడతడ్నొదిలి ఎలా పోనుమావా!"

"ఎర్రిమొగవా! ఆడ్నొదిలి రమ్మని దొరసావమ్మెట్టా సెబుతాది ఆడ్ని తీసుకునే రమ్మన్నారు. ఆడ్నే వుయ్యాలకట్టి ఆడించుకోవచ్చు"

దొరసానమ్మ పసిపిల్లాడ్ని చూసి ముద్దాడింది" అంతా నీ పోలికేనే. అదృష్టవంతుడు" అంది.

కొత్త చొక్కాలు, పౌడరుడబ్బా, సబ్బులు ఇచ్చింది.

"వీడ్నిక్కడే వొదిలి నువ్వు నీ మొగుడి దగ్గరకు పోవే" అంది పరాచికంగా.

ఓసారి దొర నీలిని పిలిచి బాకీ లెక్కలు చెప్పాడు.

"ఈ లెక్కన రెండేళ్లు చేస్తే బాకీ సెల్లయిపోద్ది" అన్నాడు.

"తవరి దయ దొరా! బుడ్డోడిగురించి శానా ఆశలు పెట్టుకున్నాం. ఏదో ఆ పొలం సేతిలో వుంటే నాలుగు బత్తాలు పండించుకుని బిడ్డడ్ని సదివించుకోవాలనుంది.

దొర నీలిని ఆశ్చర్యంగా చూశాడు. "నువ్వు పెద్దింట పుట్టాల్సిందానివే! అయినా నీ బిడ్డకేమే! మేమంతా లేమూ! ఆడ్ని దొరసానమ్మ కన్నబిడ్డలా సూసుకుంటుంది. ఆడికేటి కావాలన్నా తక్కువ జేస్తదా? నమ్ముకున్నాళ్లకి న్యాయం చెయ్యడం మా బాధ్యత"

అప్పుడే అక్కడికొచ్చిన వీరిగాడు చేతులెత్తి మొక్కుతూ "నా ఇంటి దీపవెట్టిన దేవుడు తవరు. నా సెర్మం ఒలిసి సెప్పులు కుట్టిచ్చినా తక్కువే అవుద్ది దొరా" అన్నాడు కళ్లు చెమ్మగిల్లగా.

బల్లమీదున్న పుస్తకాలు మడిచి పెడుతూ "ఒరేయ్ వీరిగా నీతో మా పెద్ద పనొచ్చి పడిందిరా!" అన్నాడు.

"ఏంటిదొరా అది! నాతో పనంటే సిటికెలో అయిపోద్ది. ఏటి?"

"పొలం కాపలాకెట్టిన పోలెగాడు దొంగతనం సేసి పారిపోనాడుకదా! మళ్లీ నమ్మకమైన మడిసే దొరకడంలేదురా"

"నేసూత్తానే వుండాను దొరా! ఎవుడైనా మంచోడు దొరుకుతాడేమోనని. మొన్ననే మా మావకి కూడా సెప్పినాను"

"సేను పంటమీదుంది. రోజూ గేదెలు పడుతున్నాయంట. అదునులో లేకపోయాక

తరువాతెందుకు కాపలా! అందుకని విన్నే నేను కాపలాకి అంపుదామనుకుంటున్నాను. పంట కోతకొచ్చేవరకు ఆడ్నే వుండాల''

వీరిగాడి గుండె గుబేలుమంది. రాత్రిళ్లు నీలినొదిలి వనవాసంలా ఆ పంట చేలో పడుండాలంటే మనసు గిలగిలలాడిపోయింది. ఎలా చెప్పాలో తెలియక తలవంచుకున్నాడు.

''నీ బాధ నాకర్థమయిందిరా! కాని ఏం చెయ్యను చెప్పు. కోతలయ్యేవరకు నాగలా తప్పదు. మరో రెండుబస్తాల ధాన్యం ఎక్కువ కొలిస్తాలే. నీ శాకిరీ వుంచుకోను''

ఎదిరిమాటాడు ధైర్యంలేకపోయాడు వీరి గాడు. నాలుగురోజులు బాధపడ్డా మరో రెండు బస్తాల ధాన్యం వస్తున్నందుకు నీలిమా వా సంతోషపడుతుందనుకున్నాడు. కాని నీలి ఆ మాట విని రుసరుసలాడింది.

''ఎట్టా ఒప్పుకున్నావయ్యా! పగలంతా గొడ్డుశాకిరి సాలక రేత్తిరి ఈ జాగారం కూడానా! నువ్వు మడిసివన్నమాటే మరిసి పోవావా? నేనీ బిడ్డనెత్తుకుని ఒంటరిగా గుడిసెలోవుండాలా? నేనొప్పుకోను. దొరకి నే సెబుతాను''

''వొద్దే! నాలుగు రోజులు కట్టపడితే అయిపోతుంది. ఈ బాగ్గానికి మనల్ని కన్నబిడ్డల్లా సూసుకునే దొర మాట కాదం టామా? బాగోదే. ఆలోసించు''

నెత్తి కొట్టుకుంది ''మన కర్మయ్యా! పొగులంతా నేనేది సాలక రేత్తిర్లుకూడా వూడిగమేనా! మన బతుకులింతే!

అన్నం తిని తలపాగా చుట్టుకుని లాంత రు పుచ్చుకుని పొలానికెళ్తున్న భర్తను చూస్తు ంటే దుఃఖం వచ్చింది నీలికి.

పిల్లాడి ముద్దా ముచ్చటా సూసుకునే సమయుంకూడా లేనందుకు బాధపడింది.

తండ్రిని చూసి చేతులూపుతున్న కొడు కును గుండెలకు హత్తుకుని లోపలికెళ్తుతుం టే ఎవరో పిలిచారు.

''దొరసానమ్మగారికి సుస్తీ ఎక్కువైంది.



వెంటనే నిన్ను తీసుకురమ్మన్నారు'' అంటూ చెప్పారు.

నీలి కంగారుగా పిల్లాడ్ని చంకనేసుకుని గుడిసెకు తాళం పెట్టి వచ్చిన మనిషి వెనకే బయలుదేరింది.

దొరసానమ్మకు ఆయాసం ఎక్కువైందట. అప్పుడే డాక్టరు మందివ్వడంతో పడుకుని వుంది.

దొర చెప్పాడు ''దొరసానమ్మకు తోడుగా వుండు నీలీ! నీ మొగుడెలాగూ పొలంకి పోతున్నాడుకదా? ఒంటరిగా గుడిసెలో ఎందుకు ఉండనే పడుకో!''

తలూపింది.

ఆరోజునుండి నీలి మొగుడు పొలానికెళ్ల గానే పిల్లాడ్ని తీసుకుని దొర బంగళాకి పోతుంది.

''ఇప్పుడు గుడిసెలో వుందో లేదో! ఇంటిదారి పట్టిన వీరిగాడు అనుకున్నాడు.

తిన్నగా దొర బంగళాకెళ్లి ఒళ్లు బాగుండ లేదని చెప్పి నీలిని గుడిసెకు తీసుకుపోవాలి అనుకున్నాడు.

అసలీ మధ్య నీలికెంతసేపూ కొడుకూ, దొర ఇల్లుతప్ప మరో ధ్యాస వుండడంలేదు. తీరిగ్గా కూర్చుని ముచ్చట్లాడుకుంది లేదు. సరసమాడబోయినా 'సాల్లే సంబడం' అంటూ లేచెళ్లిపోతుంది.

ఒక్కోసారి కోపమొచ్చి ''ఏటే సరసం సట్టుబండల్లేకుండా గానుగెద్దు బతుకేటి?'' అంటే కంటి కొసనుండి చూస్తూ ''అబ్బో అదిప్పుడు గ్యాపకానికొచ్చిందా?'' అంటూ పిల్లాడ్ని అడ్డాల్లో వేసుకునేది.

ఎప్పుడైనా పంతానికి రెక్కపట్టుకుని 'రాయే' అంటూ దగ్గరకు లాక్కోబోతే కూసింతాలీసిం అయితే దొరసానమ్మ సిరాకు పడుతుంది. వొదులు. పెద్దోరిక్కోపం వత్తే మన బతుకులు గాలికి కొట్టుకుపోయే గడ్డిపోచలవుతాయి.'' అంటూ ఒంటిమీద చీర సర్దుకుని పిల్లాడ్ని చంకనేసుకుని వెళ్లిపోయేది.

'ఇయ్యాల నీలి ఎన్ని సెప్పినా పొదిలేది లేదు' అనుకుంటూ వుషారుగా పాట పాడుకుంటూ బయలుదేరాడు. దొరింటికెళ్లే దారిలోనే తన గుడిసె.

అల్లంత దూరానుండగానే చప్పున ఆగిపోయాడు.

గుడిసెలో దీపం మినుకుమినుకుమంటుంది.

''అంటే ఇయ్యాల నీలి దొరసానమ్మకాడికి పోలేదా!'' అనుకున్నాడు.

అంతలోనే గబగబా అడుగులేస్తూ గుడిసెకు చేరుకుని తడిక నెట్టాడు.

''ఎవురదీ!''

''నేనే!''

అప్పుడే నీళ్లు పోసుకుందేమో చీరకట్టుకుంటూ ఆశ్చర్యంతో మొగుడ్ని చూసింది.

''ఏటీయేలప్పుడు!''

''నేను సరే నువ్వేటి దొరసానమ్మకాడికి పోకుండా నాకోసం సూత్తున్నావా? సక్కని తొక్కొచ్చాన్నమాట''

''ఆ! మరే''

వాసన పౌడరు రాసుకుని తిలకం దిద్దుకుంది. గూట్లో పెట్టుకున్న సన్నజాజుల దండ సిగలో చుట్టుకుంది.

వీరిగాడు వేడెక్కిపోతూ భార్యను దగ్గరకు తీసుకోబోయేడు.

''ఎంతంగా వుడావే నీలీ! ఈ మద్దెన సరిగా సూడనైనా సూశామకాదు. ఈ సిలుకు పీర, సిగపూలతో కలవారింటి పడుచులా నిగనిగలాడిపోతున్నావు''

''సర్లే. నువ్విట్టా వచ్చావని తెలిత్తే దొర అగ్గయిపోతాడు. సేనుకెల్లు. ఈ యేల వాకలీసం అయిపోనాది. పోతుండా'' అతడి చెయ్యి పక్కకు నెట్టి ఉయ్యాల్లో బిడ్డను చంకనేసుకుంది.

''అదేటో నన్నొదిలి అట్టా పోతుండావు నీకోసం నేనెంత కొట్టుకులాడిపోతున్నానో ఎంత కోరికతో వచ్చానో తెలుసా?''

''తెలిసీ సేసేదేముంది. అవతల దొరసానమ్మ ఆలీసం అయిపోతే సిటపటలాడిపోతాది'' అంటూ బయటకు నడిచింది వానపడకుండా కొంగు తలమీదుగా కొడుక్కి కప్పుతూ.

నిలువుగుడ్లేసుకుని నిలబడిపోయాడు వీరిగాడు.

నీలి సింగారం చూస్తుంటే మతిపోతుంది.

అసలు దాని వ్యవహారమే కొత్తగా అనిపిస్తుంది.

ఇక ఉండబట్టలేకపోయాడు.

దొర బంగళాకి బయలుదేరాడు.

జోరున వాన కురుస్తుంది.

ఎవరికంటా పడకుండా చీకటిమాటున నీలిని గమనిస్తూ నిలబడ్డాడు.

దొరసానమ్మ గదికెళ్ళిన నీలి నిమిషం గడవకముందే బయటికొచ్చింది.

పిల్లాడ్ని ఉయ్యాల్లో పడుకోబెట్టిందో, దొరసానమ్మకు అప్పజెప్పిందోకాని ఒంటిగా దొర గదివైపు నడిచింది.

వీరిగాడు ఊపిరి బిడబట్టి చూశాడు.

తిన్నగా గదిలోకెళ్ళి తలుపులుమూసింది.

ఒక్కసారిగా గుండెల్లో గునపం దిగినట్లు

## చేతివంట

''నీ నెలసరి జీతంలో మీకు ఖర్చు దేనికి తక్కువగా అవుతుంది?'' అడిగాడు రామానుజం.

''బియ్యంకు''

''అదేమిటి! మీకుటుంబం పెద్దదిగదా!''

''అవుననుకో. కానీ... మా యావిడ చేతి వంట మేము ఎవ్వరం సరిగ్గా తినం'' చెప్పడు సోమానుజం.

- బి.వి.ఎస్. బాబు (తెనాలి)



కలుక్కుమంది. తూలి పడబోయి నిలదొక్కుకున్నాడు.

వెంగున వెళ్లి గోడవారగా నిలబడి చెవులు రిక్కించాడు.

"ఏటే ఇంతాలీశం!"

నీకట్టాగే వుంటాది దొరా! పిల్లాడ్ని సూసుకోవాలా! వూరోల్ల కనుగప్పి రావాలా మరి!''

"నేనుండగా నీకు భయమేటే?"

"అబ్బ! వుండు దొరా!" వగలుపోతున్న నీలి గొంతు సెగలు పుట్టిస్తుంటే నిలువెల్లా తగలబడిపోతున్నట్లు, తను కాలి పిడికెడు బూడిదైపోయినట్లు అనిపిస్తుంది వీరిగాడికి.

ఆశలన్నీ మొదలునరికిన వృక్షాల్లా నేల కూలిపోతుంటే తన సర్వస్వం అనుకున్నవన్నీ అధఃపాతాళానికి కుంగిపోతున్నట్లు అనిపిస్తుంటే మనిషి అతలాకుతలం అయిపోయేడు.

ఎంత మోసం! ఎంత దగా!

రక్తం కుతకుతలాడుతుంటే పిడికెళ్లు బిగుసుకున్నాయి.

ఊపిరి పాము బుసే అయింది. కళ్లు చింతనిప్పులయ్యాయి.

"ఈ రోజుతో దీని బతుకు సరి' అనుకుంటూ గబగబ పశువుల పాకలోకెళ్లి చూరునుండి కత్తితీసాడు. ఉరుములు మెరుపులతో వాన ఉధృతమైంది.

పళ్లు కొరుకుతూ తలుపు వారగా నిలబడ్డాడు.

క్షణాలు రాకాసి ముళ్లలా అనిపిస్తున్నాయి. ఎక్కడో పిడుగు పడగా వురుములు మెరుపులతో ప్రకృతి బీభత్సంగా వుంది.

తలుపు తెరుచుకుంది. నీలి చెదిరిన జుట్టుతో అస్తవ్యస్తంగా వున్న చీరతో కొర్దిగా తూలుతూ బయటకు వచ్చింది.

అంతే! ఒక్క ఉదుటున లేచి నీలి కొప్పందుకున్నాడు.

"థూ! నీ బతుకు సెడ. సివరికిట్టా దిగజరావా?"

తలెత్తింది. "మావా! మువ్వా! పద మావా! ఈడనుండి ఏడకైనా దూరంగా మనబిడ్డని తీసుకుని పారిపోదాం పదమావా!'' కంగారుగా అతడి చెయ్యి పట్టుకుంది.

విదిలించాడు. "సీ! నీతోకలిసి బతకడమా! నా బతుకుని బద్దలు సేసావుకదే. కళ్లల్లో ఎట్టుకుని సూసుకున్నందుకు నా కన్నుగప్పి ఎంత పని సేసావే! నిన్నసలు బతకనిస్తే మహా పాపమవుద్ది. సావు'' అంటూ కత్తి పైకెత్తి కస్సున గుండెల్లో దింపాడు.

నీలి కుప్పకూలింది.

"ఎంత పని సేసావు మావా! నేను సెడిపోలేదు. నీమీదొట్టు. దొర నామీద కన్నేసి మనకన్యాయం సేయాలని సూసాడు. దొరసానమ్మను బెదిరించి నన్ని ఇంట్లో పెట్టాడు. నిన్ను సంపుతానని బెదిరించి నన్ను లొంగదీసుకోవాలని సూసాడు. కాని నేనేం సేసానో సూడు. ఎల్లి దొరని సూడు!

ఒక్క అంగలో గదిలోకెళ్లి దొరను చూస్తూనే కెవ్వుమన్నాడు.

నెత్తుటి మడుగులో మంచంమీద అడ్డదిడ్డంగా పడివున్నాడు.

గుమ్మంలోకొచ్చి మెలికలు తిరిగిపోతున్న

నీలిని పొదివిపట్టుకుని ''ఎంత పని సేసావు నీలీ!'' అంటూ బావురుమన్నాడు.

''నామీద కన్నేసి నన్నే కావెయ్యాలని సూత్తంటే లొంగినట్టే నమ్మించి సోకుసేసుకొచ్చి పాడిసేసాను. ఈడి పడగ నీడ నీకెప్పటికీ వెట్టిశాకిరీ తప్పదు. మన బిడ్డకి ఎలుగుదారే వుండదు. ఏ నిముసాన ఇసపు కాటేత్తాడోనన్న భయం తప్ప నాకు మనశ్శాంతే వుండదు. అందుకే సంపేశాను. ఇప్పుడన్ని కట్టాలూ గట్టెక్కినాయనుకుంటే.... అబ్బా!'' విలవిలలాడుతూ వూపిరి తీసుకోలేకపోతోంది.

''ఎల్లిపోయావా! ఈడనుంచి మన బిడ్డని తీసుకుని పారిపో. అడ్ని సీకట్లో కాక ఎలుగులో పెంచు''

''ఎంత పని చేశావే! దొర గురించి నాకొక్క మాట సెప్పకపోయావు!'' వీరిగాడు ఏడుస్తున్నాడు.

''సెబితే నీకు భూమ్మీద నూకలు సెల్లిపోతాయి. అప్పుడు నేను దొర ఉంపుడుగత్తెగా, మన బిడ్డ నీలా వెట్టిశాకిరీకి అంకితమయ్యేవోల్లం. అందుకే సెప్పలేదు. ఈ పడగ నీడనుండి బయట పడాలనే ఇంత పని సేసాను మావా!'' ఎగరొప్పుతూ ఆగింది.

క్షణాల్లో బంగళాలో జనం అంతా అక్కడ చేరారు.

దొరసానమ్మ ఏడుస్తుంటే నీలి అంది.

''సెమించు తల్లీ! దొరకి లొంగలేక సంపేసి నన్ను నేను పాడుసుకున్నాను. మావకేం తెలీదు. అడ్ని వొగ్గెయ్యండి. బిడ్డను తీసుకుని యాడికైనా పోయి ఆడి బతుకాడ్ని బతకనివ్వండి''

నీలి కన్నులు మూతలుపడ్డాయి.

అప్పుడే తూర్పున నెత్తురు ముద్దలా వున్న సూర్యుడు పైకొస్తూ తెల్లని వెలుగు రేఖల్ని ప్రసరిస్తున్నాడు.

✻

# హీరో శివరావు



ఒకప్పటి హాస్య నటులలో కస్తూరి శివరావు ప్రథములు అని చెప్పవచ్చు. అంతేగాక ఆయన అప్పట్లో నటించే చిత్రాలలో హీరోలు ఎంత పారితోషికం తీసుకునేవారో అంత పారితోషికం తీసుకునేవారు. అది అప్పట్లో హాస్యనటుడు కస్తూరి శివరావు డిమాండ్. ''ఏ సెట్‌లోనైనా హీరో హీరోయిన్, శివరావులుంటే పరాయివాళ్లు (సినిమావాళ్లే) వచ్చి ముందుగా పలుకరించేది కస్తూరి రావునే అంతే. అతనిలో అహంకారం, అహంభావం పెరిగిపోయింది. పరిశ్రమలో పెద్దల్నికూడా గౌరవించేది లేదు. అదే ఆయన పతనానికి దారితీసింది. దీనినే స్వయంకృతాపరాధం అంటారు'' అని ఇటీవల కలిసినప్పుడు మాటల సందర్భంలో అల్లు రామలింగయ్య పై సంఘటన వివరించారు.

సుబ్బారావు